ఆ ఊరిరు గుప్పు మంది.

అది పల్లెటూరు కాదు. అలాగని పెద్ద పట్టణమూ కాదు.

కాని పట్నం అని చెప్పుకోడానికి అక్కడ మున్సిపాల్టీ ఉంది. అంచేత దోమలున్నాయి. కాలేజీ ఉంది,




# ఓ(ప్రేమి)కుల కథ

అంచేత స్టయికులున్నాయి. రైల్వే స్టేషనుంది అంచేత రాక్షసిబొగ్గు చవగ్గా దొరుకుతుంది. రోగాలున్నాయి అంచేత డాక్టర్లున్నారు. కోర్టుంది అంచేత ప్లీడర్లున్నారు.

ఆ ఊళ్ళో ధనవంతులు, భాగ్యవంతులు, పని లేని వాళ్ళు అబ్బో చాలామందున్నారు అందుచేత రాజకీయాలు, పార్టీలు, గ్రూపులు, కొట్టుకోడాలు, కోర్టులచుట్టూ తిరగడాలు ఉన్నాయి

అసలు విషయం మరిచేపోయాం ... ఆ ఊళ్లో శాంతి- భద్రతలు భద్రంగా కాపాడ్డానికి పోలీసు స్టేషనుంది.

ఆ ఊర్నీ, అక్కడి జనాన్నీ జాగ్రత్తగా పరిశీలిస్తే మనకి తెలిసే విషయమేమిటంటే— ఆ ఊళ్లో ప్రతి వృత్తీ వ్యాపారంలాంటిది డాక్టర్లు వైద్యమనే వ్యాపారం చేస్తారు. లాయర్లు ప్రాక్టీసనే వ్యాపారం చేస్తారు. లెక్చ




వీరభద్రరావ్ పమ్మి

ర్లు ట్యూషన్లనే వ్యాపారం చేస్తారు ఏ పనీ లేని వాళ్ళు రాజకీయమనే వ్యాపారం చేస్తారు వ్యాపారమన్నాక పోటీ తప్పదు.

ధనస్వామ్య వ్యవస్థలో ఏ వ్యాపారమైనా పోటీతో కూడుకుని ఉంటుందని ఎకనామిక్స్ చదవకుండానే అందరికీ అర్థం అవుతుంది.

అలాంటి పోటీ విపణిలో (కాంపిటేటివ్ మార్కెట్) వైద్య వ్యాపారం చేస్తున్న ఒక డాక్టరుగారున్నారు.

ఆయన పేరు ఫణీంద్రరావు . .

నాగుల చవితినాడు పుట్టాడని తలిదండ్రు లాయనకా పే రె ట్టా రు . అయినా ఆయన సార్థక నామధేయుడు. ఆయన సంపాదనకి గాని, ఆయన వ్యాపారానికి గాని. ఆయన ప్రిస్టేజ్‌కి గాని ఎవరేనా అపకారం తలపెట్టారా?

ఆయన నాగు పామైపోతాడు !

పాముల నర్సయ్య కూడా ఆయన్ని ఆపలేదని ఆ ఊళ్ళో అందరికీ తెల్సిన విషయమే !


ఫణీంద్రరావు ఆ ఊళ్ళో చాలా ఏళ్ళగా వైద్యం చేస్తున్నాడు. రెండు చేతులా డబ్బు, అంతకుమించి పలుకుబడి, అంతకుమించి గర్వం సంపాయించాడు ముఖ్యంగా ఆయన చిన్న పిల్లల వైద్యంలో నిపుణుడు. ఇన్నాళ్లు ఆ ఊళ్ళో మరో చిల్డ్రన్ స్పెషలిస్ట్ లేని కారణంగా ఆయన వైద్య వ్యాపారానికి పోటీ లేకుండా పోయింది. రాను రాను అతనికి పెద్ద పేరు వచ్చింది. అతను పూర్తిగా డబ్బు మనిషని, బీద బిక్కలను చూడదని ప్రజలకి తెల్సింది.

"అవునండీ.... నేను వేలు లక్షలు పోసి చదువుకున్న దెందుకు? ఊరికే వైద్యం చెయ్యడానికా? నా దేవన్నా ధర్మాసుపత్రి అనుకున్నారా? బీదబిక్కలను కూడా చూస్తాను కాని నా రేటు మారదు అదిచ్చెయ్యాల్సిందే. సెకండ్ క్లాసు టికెట్ కొనుక్కుని రైల్లో ఫస్ట్ క్లాసు ప్రయాణం చేస్తానంటే రైల్వే వాళ్ళూరుకుంటారా? గవర్నమెంటూరుకుంటుందా?— ఊరుకోదు. అలాంటిదే నా వైద్యం కూడా. " అని ఆయన చాలాసార్లు పబ్లిగ్గానే అన్నాడు.

ఫణీంద్రరావుకి అలా అనడానికి సరిపడ డబ్బుంది తన కులపు మద్దతు ఉంది. మున్సిపాల్టీలో ఓ వర్గం వారి అండదండలున్నాయి. ఇవన్నీ ఆయనకున్న ప్లస్ పాయింట్లని ఆయన నమ్మకం . ...

"అవును అయ్యే ఆడిమైనస్ పాయింట్లు...." అంటాడు వెంకటస్వామి,

వెంకటస్వామికి ఫణీంద్రరావుని వ్యతిరేకించేంత డబ్బుంది. ఆ డబ్బు



సంపాయించడానికి సారాపాటలున్నాయి మున్సిపాల్టీ మీద కన్నుంది. పోటీ చెయ్యడానికి సరిపడ కులపు మద్దతు ఉంది. ఆ మద్దతు సంపాయించాలంటే ఫణీంద్రరావుని, ఆయన కులాన్ని వ్యతిరేకించాలి

ఈ ఆలోచన రాగానే తన కులం వాడైన సుగుణరావనే డాక్టర్ని పిలిపించి ఆ ఊళ్ళో ప్రాక్టీసు పెట్టించాడు. ఆతనికీ చాలా డిగ్రీలున్నాయి. అతనూ చిల్డ్రన్ స్పెషలిస్ట్

ఆ ఊళ్ళో వైద్యమనే వ్యాపారం కుల ప్రాతిపదికమీద పోటీలో పడింది. ఎల్.ఎమ్.పిలు, ఆరెంపీలు, సంచి కట్టు డాక్టర్లూ ఈ పరిధిలోకి రారు.

ఇలా ఉండగా . .

వీణ ఫణీంద్రరావుగారి పెద్దకూతురు ఆమెకి ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు

వీణ మెరుపు తీగలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. వయసు తెచ్చిన అందం మరింత తోడైంది. పైగా ఆ అమ్మాయి పలికితే వీణ మీటినట్టుగా ఉంటుంది. అంతేకాదు ఆమె లలిత సంగీతం చక్కగా, హాయిగా పాడగలదు.

ఇన్ని ఆకర్షణలున్న వీణ పాపారావును ప్రేమించింది- చిత్రం. అతన్ని పెళ్ళి చేసుకుంటానంది. ఇంకా విచిత్రం.

అసలదంతా ఎలా జరిగిందంటే.

వీణ ఫణీంద్రరావుగారి కూతురన్న మాటే గాని ఆమెకాయన లక్షణాల్లో ఏది రాలేదు. ఆమెకు తండ్రి ప్రాక్టీసు

గురించి అక్కర్లేదు. ఆయన సంపాదన గురించిగాని, సంపద గురించిగాని అక్కర్లేదు ఆయన రాజకీయాల గురించి అక్కర్లేదు. అసలాయన మిత్రవర్గం ఎవరో, శతృవర్గం ఎవరో ఆమెకి తెలియదు.

ఆమెకెంతసేపు చదూకోడం, విరిసిన గులాబీ పువ్వుల్లో అందాలుచూడ్డం, అస్తమిస్తున్న ఎర్రరంగు సూర్యుణ్ని చూసి మురిసిపోడం, మేడమీదగదిలో కూర్చుని కమ్మని పాటలు పాడుకోడం తప్ప— ఆమెకింకేమీ అక్కర్లేదు.

ఆమె బి ఎ మొదటి సంవత్సరం చదూతుండగా— కళాశాల దినోత్సవానికి పాటలు పాడాలనీ, తయారవ్వమని లెక్చరర్ చెప్పారు

"నాకొచ్చిన పాటలన్నీ ఇంటర్‌లో ఉండగా పాడేశాను. మళ్ళీ అవ్వే అంటే జనానికి బోర్‌గా ఉంటుంది. కొత్తపాట ఏదైనా వుంటే ప్రాక్టీసు చేస్తాను." అని వీణ అన్నప్పుడే పాపారావు గురించి చెప్పారా లెక్చరర్ గారు

పాపారావు అందగాడు కాదు. ఆకర్షణీయంగానూ ఉండడు. అతను ధనవంతుడు కాడు, అంచేత డబ్బువల్ల వచ్చే అందంగాని, ఆకర్షణకాని అతనిలో లేవు. మనిషి సాదా, సీదాగా ఉంటాడు. ఎప్పుడు చిర్నవ్వులో, శుభ్రంగా - మాలిన్యం లేని మల్లె పువ్వులా ఉంటాడు

అతనా వూరి రైల్వే స్టేషన్లోబుకింగ్ క్లర్కుగా పని చేస్తున్నాడు పెళ్ళి కాని వాడు బరువు బాధ్యతలు లేనివాడు

పాపారావులో ఉన్నది ఒకే ఒక ఆకర్షణ— అతను కవి, భావకుడు, కదిలే మేఘాల్లోను చంటి పిల్లాడి లేతబుగ్గలోను, మెరిసే పువ్వుల్లోను, ఉదయించే సూర్యుడిలోను సృష్టి చాతుర్యం, చమత్కారం చూడగలడతను, స్పృంసించగలడు. పలవరించగలడు, పాటలు, కవితలు కూర్చగలడు

అతను రాసిన కవితలు కొన్ని పత్రికల్లో రావడం, అతన్ని సన్నిహితులు, స్నేహితులు కవిగారూ ' అని పిలవడం జరుగుతూ ఉంటుంది

పాపారావు గురించి ప్పిన లెక్చరర్ గారు

"అతను చాలా మంచి పాటలు రాశాడు నువ్ సాయంత్రం మా ఇంటికిరా— అతన్ని కూడా 'మ్మంటాను అతను పాటలకి వరుసలు కూడా కట్టగలడు. ఏవైనా రెండు మూడు పాటలు సెలక్ట్ చేద్దాం." అన్నారు

వీణ సరే నంది

ఆరకంగా వీణ పాపారావుని మొదటిసారి కల్సుంది. మొదటి చూపులోనే అతని మీద గౌరవం భావం కలిగింది.

పాపారావు తను రాసిన పాటలు కొన్ని విన్పించాడు "రాలేదు నా చంద్రికా" అన్న పాట కతను విన్పించినపుడు వీణకి తనకి తెలియకుండానే అతని మీద ఇష్టం కలిగింది ప్రతి పాటలోను ప్రకృతిని వర్ణించే అతని హృదయం ఆమెకు నచ్చింది

తర్వాత వాళ్ళు చాలాసార్లు కలుసుకున్నారు అతని పాటలు ఆమె పాడింది

తమ ఇద్దరి భావాలు. ఆలోచనలు. ఇష్టాలు ఎక్కడో ఒకదానికి తెలియని ఓ మెరుపు అంచుదగ్గర కలుసుకుంటున్నట్టుగా ఆమెకు అనిపించింది

ఆనాటినుంచి వీణ పాపారావుకి అభిమాని అయ్యింది స్నేహితురాలయ్యింది సన్నిహితురాలైంది

ఇన్నాళ్టికి తన పాటలకి జీవం పోసే ఓ కమ్మని కంఠం దొరికిందని పాపారావు ఆనందపడ్డాడు. తను కాయితల మీద రాసిన అక్షరాలు, పదాలు, పాటలు ప్రాణం పోసుకుని గాలిలో విహరిస్తుంటే అతను తన జన్మ ధన్యమైనట్టు ఫీలయ్యాడు అతనిలో వీణ పట్ల ఆరాధన పెరిగింది

అక్షరాలకి, స్వరానికి మధ్య — సంగీతానికి, సాహిత్యానికి మధ్య అనాదిగా ప్రేమ ఉంది.

వీణ, పాపారావు ఒకరి పట్ల ఒకరు అభిమానం, ఆరాధన, ఇష్టం. ప్రేమ పెంచుకున్నారు.


రాలేదనుకున్న చంద్రిక వచ్చినట్టు, విరియదనుకున్న హృదిమాలిక విరిసినట్టు అనిపించడం మొదలైంది.

ఊరికి చివరున్న పంపుల చెరువు దగ్గర తరచు వాళ్ళిద్దరు కలుసుకునేవారు రాను రాను వీణ పాపారావు గదికి ధైర్యంగా వెళ్ళడం మొదలెట్టింది

ఆ ఊరు అంటుకోడానికి, గుప్పుమనడానికి ఇవి చాలు కొందరు చెవులు కొరుక్కున్నారు మరికొందరు పబ్లిగ్గానే చెప్పుకున్నారు కాలేజీ గోడల్నిండా వాళ్ళిద్దరి పేర్లు అసహ్యంగా రాయబడ్డాయి

వీళ్ళ ప్రేమకథ ఎక్కువ ప్రాచుర్యం పొందడానికి ప్రజల కలాంటి విషయాల పట్ల వుండే ఉత్సుకత కొంత కారణం అయితే వీణ వివాదాస్పదమైన వ్యక్తి డాక్టర్ ఫణీంద్రరావు కూతురు కావడం మరో కారణం. అంతే కాదు పాపారావు ఫణీంద్రరావుకి వ్యతిరేకుడైన వెంకటస్వామి కులానికి చెందిన వాడు కావడం అన్నిటి కన్నా పెద్ద కారణం

ఫణీంద్రరావు వర్గంవాళ్లు దీన్ని అవమానంగా భావించారు. వాళ్ళంతా కలిసి ఓ మీటింగెట్టుకుని ఈ అవమానాన్ని భరించడం కష్టమని ఫణీంద్రరావు ఈ విషయంలో వెంటనే ఏదో ఒకటి చెయ్యాలని ఆయనకు తమ మద్దతు ప్రకటించారు.




ఫణీంద్రరావు వ్యతిరేక వర్గంవాళ్ళు మర్నాడో మీటింగెట్టారు తమ కులస్థుడైన పాపారావు ఫణీంద్రరావు పుత్రికను ప్రేమించినందుకు (అవ్విధంబుగా ఫణీంగ్రరావుని బజారుకు లాగినందుకు) హర్షాన్ని వ్యక్తపరుస్తూ ఓ తీర్మానం చేశారు. పాపారావు వీణతో తన ప్రేమ వ్యవహారం కొనసాగించేందుకు, ఆమెను పెళ్ళాడేందుకు కావల్సిన హార్ధిక, ఆర్థిక సహాయం చెయ్యాలవి నిర్ణయించారు. ఈ విషయమై పాపారావు ఎప్పటి కప్పుడు మాట్లాడి అతనిక్కావాల్సిన సలహా, సహాయం డబ్బు అందజేసేందుకు వెంకటస్వామికి అధికారం ఇచ్చారు.

ఇదంతాతెల్సిన పాపారావు ఆశ్చర్య పోయాడు.

ఈ మీటింగు విషయం తెల్సిన ఫణీంద్రరావు వర్గంవాళ్లు రెచ్చిపోయారు ఫణీంద్రరావు మీద వత్తిడి తెచ్చారు

ఫణీంద్రరావు పగబట్టాడు బుస కొట్టాడు కాని వివాదంలో ఇరుక్కున్న వ్యక్తి సొంత కూతురు కాబట్టి కాటెయ్యలేదు ఆమెను కట్టడిలో పెట్టారు.

వీణ ఆరోజు నుంచి కాలేజీ మానెయ్యాలి ఇంటి గడపదాటి బైటకి వెళ్ళకక్కర్లేదు. ఆమె బైటకి వెళ్ళకుండా తల్లి, తమ్ముడు కాంపౌండర్ రాము ఎల్లవేళలా కాపలా ఉంటారు

ఈ పరిణామానికి వీణ బాధపడింది. ఏడ్చింది మొత్తుకుంది కాని ఎవరూ ఆమె మొర ఆలకించలేదు

వెంకటస్వామి తన దగ్గరకు రావడం, అతని మాటలు, రాజకీయాలు పాపారావుకి ఆశ్చర్యం కలిగించాయి. వీణ, తను ప్రేమించుకున్న మాట వాస్తవం. పెళ్ళి చేసుకోవాలనుకున్న మాట వాస్తవం. కాని అది తామిద్దరి వ్యక్తిగత సమస్య. తమ వ్యక్తిగత సమస్యలో వాళ్ళంతా ఎందుకు తల దూరుస్తున్నారో అతనికి అర్థ కాలేదు. కొంచెం చిరాకు కూడా వేసింది.

ఇద్దరు వ్యక్తులు ప్రేమించుకోడం నిజంగానే వాళ్ళ వ్యక్తిగత సమస్య. కాని మన సమాజంలో దాన్నిలా వది లెయ్యకుండా ఆ వ్యక్తుల కుటుంబాలు దాన్ని కుటుంబ సమస్యగా పరిగణి స్తారు. ఇది సాధారణంగా అన్ని ప్రేమ కధల్లోను జరిగే విషయం.

కాని పాపారావు, వీణల ప్రేమకధ సామాజిక సమస్యగా, ఆ ఊరి సమ స్యగా, రాజకీయ సమస్యగా పరిణ మించింది. దీన్ని అడ్డం పెట్టుకుని బలా బలాలు తేల్చుకోవాలని ఇరువర్గాలవాళ్లు నిర్ణయించుకున్నారు.

ఈ పరిణామాలకి పాపారావు, వీణ ఇద్దరూ బాధపడ్డారు. ఓసారి కల్సుకుని ముఖాముఖీ మాట్లాడుకుని ఈ సమస్యకి పరిష్కారం వెతుక్కుంటే మంచిదని అనిపించింది. వీణ ఇంట్లోంచి బైటికి రావడానికి వీల్లేదు. తెగించి వాళ్ళింటి కెళ్లే ధైర్యం పాపారావుకి లేదు.

ఊరంతా ప్రేమ గొడవలో అట్టు గికి పోతోంది. రకరకాల రూమర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఆ రాత్రి ఫణీంద్రరావు వర్గంవాళ్ళు పాపారావు రూంమీద దాడి చేస్తారని, పాపారావుని కొడతారని ఓ వార్త దావానలంలా వ్యాపించింది, పాపారావు వెంకట స్వామి వర్గంవారి సహాయం తీసుకోక తప్పలేదు,

"నీకేం ఫరవాలేదు. మేమున్నాం" అని పాపారావుకి వాళ్లు ధైర్యం చెప్పారు. సాయుధులై అతని రూం దగ్గర కాపలా నిలబడ్డారు.

ఆరోజు ఏదో కొట్లాట జరగబో తోందని తెల్సిన సర్కిల్ ఇన్స్పెక్టర్ హుటాహుటిన పోలీసు బలగాన్ని ఆ ప్రాంతానికి తరలించి, ముందు జాగ్రత్త చర్యగా 144వ సెక్షన్ విధించి- ఏమాత్రం గొడవ జరిగి, శాంతి భద్రతలకు భంగం వాటిల్లినా తగు చర్య తీసుకుంటానని ఇరువర్గాల్ని హెచ్చరించాడు.

ఊళ్ళో ఏమూల విన్నా ఇదేగొడవ, ఊరంతా టెన్షన్‌తో నిండిపోయింది.

ఇక్కడే కధ ఓ కొత్త మలుపు తిరిగింది,

రాము చాలా ఏళ్లుగా ఫణీంద్రరావు దగ్గర కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు, వాళ్ళిద్దరూ ఒకే కులం వాళ్లు, అలా గని ఫణీంద్రరావుకి అతని మీద

ప్రత్యేకమైన ఆకిమానం లాంటి దేదీ లేదు. కేవలం తన దగ్గర నౌకరీ చేసు కొని బతికే మనిషిలా చూస్తాడంతే! డాక్టరు వేలు, లక్షలు సంపాదించినా తన కష్టానికి తగ్గజీతం ఇవ్వడంలేదని రాముకి బాధవుంది, కోపం ఉంది, అసూయ ఉంది, అయినా వేరే దారిలేక అక్కడే పనిచేస్తున్నాడు,

ఈ విషయం తెల్సిన వ్యతిరేకవర్గం వాళ్లు రాముని కల్సి అతనిపట్ల తమ కున్న సానుభూతిని వ్యక్తపరిచారు, డాక్టర్ పట్ల అతనికున్న వ్యతిరేకత సమంజసమైనదే నన్నారు. తమకు సహాయం చెయ్యమని కోరారు. ఓ జంట ప్రేమకు తోడ్పడమన్నారు.

చివరికి ఆతన్ని కొన్నారు.

ఆనాటి నుంచి రాము- పాపారావుకి వీణకి మధ్య వార్తాహరుడిలా, వెంకట స్వామి వర్గానికి ఏజంటుగా వ్యవహ రించటం మొదలెట్టాడు, ఎప్పటికప్పుడు ఫణీంద్రరావు ఇంట్లో విషయాలు వెంకటస్వామికి చెప్తున్నాడు.

నాలుగురోజులు వాతావరణ ప్రశాం తంగా ఉంది. కాని అది ప్రళయం రాబోయేముందు నెలకొన్న నిశ్శబ్దం లాంటిది....

ఓ రాత్రి....

ఓ వర్గంవాళ్లు జరగకూడదను కున్నది, మరో వర్గం ఆశించినది జరిగిపోయింది.

రాము సాయంతో వీణ ఇంట్లోంచి తప్పించుకుని పాపారావుని చేరుకుంది. ఇద్దరూ కల్సి వెంకటస్వామి ఏర్పాటు చేసిన టాక్సీలో మరో ఊరు ఉడాయిం చారు, తెల్లారకగానే ఫణీంద్రరావుకి, అతని వర్గం వారికి ఈవిషయం తెలియ లేదు, తెలియగానే చుట్టుపక్కల ఊళ్ళకి మనుషుల్ని పంపించారు. ఆ రోజు సాయంత్రానికి తిరిగొచ్చిన వేగుల వాళ్లు పాపారావు, వీణ- అతని చుట్టాల ఊళ్లో పెళ్ళి చేసుకున్నారని తెలియ జేసారు.

వెంకటస్వామి వర్గంవాళ్లు ఆవేళ పండగ చేసుకున్నారు, టొట్లు పేల్చారు. జండాలు కట్టారు, ఆవేళ రాత్రి రికార్డ్ డాన్స్ పెట్టారు.

'కింకర్తవ్యం' అనుకున్నారు ఫణీంద్రరావు వర్గంవాళ్లు. కూతురంత సాహసం చేస్తుందని ఊహించని డాక్టర్‌గారు- ఆమె అంత సాహసం చేసేసరికి షాక్ తిన్నాడు, ఏం చెయ్యాలో తోచలేదు, అవమానం, బాధ రెండూ పీడించడం మొదలెట్టాయి.

ఇటువంటి విషయాల్లో అలసత్వం, ఆలశ్యం కాకూడదని ఊరుకుంటే అవతలివాళ్ళు లోకువ కట్టి ఇంకేమైనా చెయ్యగలరని అతని అనుయాయులు సలహా ఇచ్చారు.

అన్ని రకాలుగా ఆలోచించిన మీదట వీణని పాపారావు బలవంతంగా

లేవదీసుక పోయినట్టు పోలీస్ కంప్లయింటుఇచ్చారు ఆ ప్రాంతపు డీఎస్పీ తమ కులంవాడే కావడంచేత అతని చేత సర్కిల్ ఇనస్పెక్టర్ కి చెప్పించి వెంటనే చర్య తీసుకునేటట్టు చేసారు

రెండు రోజులు తిరక్కుండా పోలీసులు పీణని, పాపారావుని పట్టుకోడం, అతన్ని లాకప్పుకి, ఆమెను తలిదండ్రులకి అప్పజెప్పెయ్యడం జరిగిపోయింది

పంతాలు పెరిగాయి

వెంకటస్వామి వర్గంవాళ్లు పాపారావుకి బెయిల్ ఇప్పించి పైటికి తీసుకొచ్చారు

ఇరువర్గాల వాళ్లు కోర్టులో బలాబలాలు తేల్చుకోడానికి సిద్ధయింకున్నారు

డాక్టర్ మహేంద్రరావుగారి కూతురు. మైనరు అయిన పీణని పాపారావు మాయ మాటలు చెప్పి లేవదీసుకుపోయి నమేగాక బలవంతంగా పెళ్ళి చేసుకున్నాడని పాపారావు మీదఅభియోగం

పీణ తన ఇష్టానుసారమే తనతో వచ్చిందని, ఆమె అంగీకారంతోనే ఆమెను తను వివాహ మాడానని ఇందులో తను చేసిన నేరమేమీ లేదని, తను నిర్దోషినని పాపారావు డిఫెన్స్ పెట్టాడు

లాయర్లకి పని తగిలింది. బార్ అసోసియేషన్ రెండుగా చీలిపోయింది

కేసు విచారణ ప్రారంభమైంది

రోజూ కోర్టు జనంతో కిటకిటలాడి పోతోంది

పీణ మైనర్ అని ఋజువు చెయ్యడానికి ఆమె ఎస్ ఎస్ సి సర్టిఫికెట్లోని పుట్టిన తేదీ దాఖలు చేశారు ప్రాసిక్యూటర్

సాక్షుల విచారణ ప్రారంభమైంది.

తనని మాయమాటలు చెప్పి బలవంతంగా తీసుకుపోయాడని, తన ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకున్నాడని పీణ సాక్ష్యం చెప్పింది


జనం ఆశ్చర్యపోయారు

పాపారావు నిస్సృహపోయాడు.

అతనికి ప్రపంచమంతా మయసభలా కనిపించింది ప్రకృతంతా చచ్చిపోయినట్టు, తన పాట గాలి బూడిదైపోయినట్టు అనిపించింది ఉదయించే సూర్యుడు కొన్ని గంటలు వెలుగిచ్చి, తనని నమ్మినవారిని చీకట్లోకి నెట్టేసే మోసగాడిలా అనిపించాడు.

పీణ - మనుషులు అనుకున్నాడు పాపారావు

అతనికి చేతులకి బేడీలు పడినట్టు, జైల్లో కూర్చుని తను తత్వాలు రాసి పాడుకుంటున్నట్టు కలలొచ్చాయి. మెలకువ వచ్చినా అవే ఆలోచనలు తనకి జైలు శిక్ష పడటం ఖాయం-అనుకున్నాడు



మర్నాడు కాంపౌండర్ రాము తెచ్చిన వార్త పాపారావుకి అతని వర్గానికి, అతని లాయరుకి కొత్త ఊపిరి పోసింది

వీణ మరో ఊళ్ళో తాతగారింటో పుట్టింది. ఆ ఊరి పంచాయతీ ఆఫీసులో ఆమె పుట్టినప్పుడు ఆ విషయాన్ని రాయించాడు. అదిసంపాదించ గలిగితే?

ఊ. సంపాయించగలిగితే!

దాని ప్రకారం ఆమె మైనరు కాదు మేజర్

ఆమెను స్కూల్లో ఆలశ్యంగా చేర్చారు అప్పుడు అయిదు నెలలు తక్కువవయసు వేసి చేర్చారు.

చిన్న మెరుపులాంటి ఆశ .

మర్నాడే టాక్సీ వేసుకుని కొందరు ఆ ఊరెళ్ళారు. అక్కడే పంచాయతీ ఆఫీసర్ని పట్టుకుని సర్టిఫికెట్ కాపీ సంపాయించారు

వాద ప్రతివాదనలు పూర్తయ్యాయి.

జనమంతా ఆత్రంగా ఉన్నారు.

ఇదో వింత కేసు

ఈ కేసులో ముఖ్యమైనవి వీణ సాక్ష్యం, ఆమె జన్మ తేదీ రెండు పక్షాలవారు చెరో జన్మ తేదీ చెప్తున్నారు ఓ తేదీ ప్రకారం ఆమె మైనర్. మరో తేదీ ప్రకారం ఆమెకు మైనారిటీ తీరింది ఆమె మేజరు అయ్యింది

వీణ మాతామహుడి ఊళ్ళోపుట్టింది. చట్ట ప్రకారం ఆమె జన్మ వివరాన్ని ఆయన - ఊరి పంచాయతీ ఆఫీసులో నమోదు చేయించాడు. డాక్టర్ ఫణీంద్ర

రావు గారు వీణను స్కూల్లో చేర్పించి నప్పుడు తన సంతకంతో ఇచ్చిన జన్మతేదీ వేరుగా ఉంది. ఆమెను అల శ్యంగా స్కూల్లో చేర్పించినందువల్ల కొన్నినెలలు తక్కువగావేసి -తక్కువ వయసున్నట్టు చూపించారని డిఫెన్సు వారి వాదం

ఇది సమంజసంగానే అనిపిస్తోంది.

వీణ తాతగారు ఆమె పుట్టిన వూరు పంచాయతీ వారికి తప్పు జన్మ తేదీ ఇచ్చి - ఎక్కువ వయసు వెయ్యాల్సిన అవసరం కనబడదు. మనవడో, మన వరాలో -ఎవరో తెలియకుండా జన్మకు పూర్వమే జనన రిజిష్టర్ లో రాయించ లేరు కదా ?

కాబట్టి వీణ మేజరని ఈ కోర్టు నమ్ముతోంది

పోతే ఇక వీణ సాక్ష్యం - ఆమె ఇష్టం లేకుండా పాపారావు తనని తీసి కెళ్ళాడని, బలవంతంగా పెళ్ళి చేసు కున్నాడని ఆమె చెప్పింది. ఆమె మేజ రయినా పాపారావు అలా చేసి ఉంటే అది నేరమౌతుంది అతను శిక్షార్హుడు అవుతాడు

కాని . పెళ్ళి జరుగుతున్నపుడు ఆ తర్వాత తీయించిన ఫోటోలు డిఫెన్సువారు కోర్టుకి సమర్పించారు. అవి చూస్తే ఆమె ఇష్టానికి వ్యతిరే కంగా పెళ్ళి జరిగి వుంటుందని నమ్మ డానికి శక్యంగాలేదు దండలు మార్చు కుంటున్నప్పుడు పాపారావుకి స్వీటు తినిపిస్తున్నపుడు ఆమెమొఖంలో ఆనం దం చూస్తే ఎవరయినా ఈ నిర్ణయానికి రాగలరు పాపారావు బలవంతంగా పెళ్ళి చేసుకోగలడేమో కాని - బల వంతంగా ఆమె ముఖంలో ఆనందం, అతిశయం, నవ్వు తెప్పించలేడు కదా?


మరయితే ఆమె అలా సాక్ష్యం ఎందుకు చెప్పినట్టు? బహుశా తల్లిదం డ్రుల బలవంతం వల్లనా? తను ఎవర బలవంతంవల్లా అలా చెప్పడం లేదని కోర్టు ముందు ప్రమాణం చేసి మరీ చెప్పింది

ఈ కేసులో ముద్దాయి పాపారావు నిర్దోషి అని ఈ కోర్టు తీర్పునిస్తోంది. కాని వారి వివాహం హిందూ వైవా హిక చట్టానికి లోబడి జరగలేదు కనుక - ఆ వివాహం చెల్లనేరదని ఈ కోర్టు తీర్పునిస్తోంది"

ఇంత జరిగాక పాపారావుకి ఆ ఊళ్లో ఉండబుద్ధి కాలేదు మరో ఊరికి ట్రాన్స్ఫర్ చేయించుకుని వెళ్ళిపో యాడు

o o o

కొన్ని నెలల తర్వాత సూట్ కేసు తో తన గదికొచ్చిన వీణని చూసిన పాపారావుకి ఆనందం, ఆశ్చర్యం, కోపం ఒకేసారి కలిగాయి.




"మళ్ళీ ఎందుకొచ్చావ్?" అన్నాడు ఉడుకుమోత్తనంగా.

"నిన్ను పెళ్ళి చేసుకోడానికి!"

"బలవంతంగానా?"

"అప్పుడలా చెప్పకపోతే అమ్మ నూతిలో దిగి చచ్చిపోతానంది"

"ఇప్పుడు మళ్ళీ అంటుంది."

"అనడానికి అమ్మలేదు"

పాపారావు వీణ కళ్ళల్లోకిచూశాడు.

"నిజంగా - అమ్మపోయి రెండు నెలలయ్యింది. నువ్ లేకుండా బతకలేను"

"వద్దు వీణా! ఈ కోర్టులు గొడవలు నే పళ్ళేను"

"నేనిప్పుడు స్కూల్ రికార్డు ప్రకారం, పంచాయితీ రికార్డు ప్రకారం, కోర్టు రికార్డు ప్రకారం ... అన్నివిధాలా మేజర్నే!"

వాళ్ళకి సూర్యుడు, చంద్రుడు చెరో పక్కనించి ఉదయిస్తున్నట్టు అనిపించింది. ★

---

ఇక నుంచీ రెండు సంచికలకోసారి వీరభద్రరావు పమ్మి స్వీటూ హాటూ, ఉప్పు పులుపుల రసజీవిత కోణాల కథల వరస మీ కోసం సరఫరా అవుతాయి.